జీవో 117తో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం

- ఉపాధ్యాయులపై అధికారుల వేదింపులను అరికట్టాలి
- డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలి
- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్. సాయిశ్రీనివాస్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రభుత్వం తీసుకువచ్చిన 117తో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అయిందని, 25వేల ఎస్‌జీటీ పోస్టుల రద్దుతో ప్రభుత్వ బడుల మనుగడ ప్రశ్నార్థకమయిందని రాష్ట్రోపాధ్యాయ(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షులు ఎల్ సాయిశ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో ఆదివారం ఎస్టీయూ 77వ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు పి. తమ్మినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పనిభారం, ఒత్తిడి పెంచి, ఉన్నతాధికారులు వేదింపుల మధ్య ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు న్యాయం జరగాలంటే వెంటనే ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, డీఎస్సీ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2008 డీఎస్సీ ఉపాధ్యాయులను రెగ్యూలర్ చేయాలని, పీఆర్‌సీ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్ లోన్ రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న రూ.18వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీనెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని, రెగ్యులర్ ప్రాతిపదికన పీఈటీల నియామకం చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ వాణి సంపాదకీయ సభ్యులు పి. సుబ్బరాజు మాట్లాడుతూ షోకాజ్ నోటీసులతో ఉపాధ్యాయులను హింసించడం సరికాదని, పాఠశాలల కరెంటు బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులపై పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లా శాఖ అధ్యక్షులు ఎస్. శ్రీనివాస్‌పట్నాయక్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని, ఇటువంటి కష్టం సమయంలో ఉపాధ్యాయులు ధైర్యంగా ఉంటూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర సుందర్‌లాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యను అందించే ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరించడం ధారుణమని, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు విద్యను అందించేలా ఉపాధ్యాయులపై వేదింపులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి వారి డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటాలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా కల్పించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీరమణ వార్షిక నివేదికను సమావేశంలో ప్రవేశపెట్టారు. అనంతరం 2024-26 జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అవ్వా, తాతలకు ప్రతినెలా రూ.3,000 : మంత్రి డాక్టర్ అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అవ్వ తాతలకు ఇక నుంచి ప్రతి నెల 3000 రూపాయలు పింఛను అందించడం జరుగుతుందని రేపటి నుంచే పెంచిన వైయస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం పలాస మండలం బ్రాహ్మణతర్లలో నిర్వహించిన వైయస్సార్ పెన్షన్ కానుక సంబర మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్ రూ.3వేలు చేయడం జరుగుతుందని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్రంలోనే అవ్వా తాతలకు అధిక మొత్తంలో పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని ఇంటివద్దనే వాలంటీర్లు ద్వారా పించన్లు అందించడం జరుగుతుందని అన్నారు ఈ వయస్సులో వారికి చిన్నచిన్న ఆర్థిక అవసరాలు తీర్చదానికి డబ్బు అవసరమని, దానికి మనందరం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేయాలని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు పింఛన్లు ఎంత ఇచ్చేవాడో మనందరికీ తెలుసునని, కానీ మన నాయకుడు జగనన్న తన పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచుకుంటూ పోతామని తెలిపిన విధంగా రేపు జనవరి 1వ తేదీ నుంచి రూ 3,000 చేయడం జరిగిందని, అలాగే గతంలో 65 సంవత్సరాలు ఉంటే కానీ ఇవ్వని పింఛన్లు నేడు 60 సంవత్సరాలు వయసు ఉంటే అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వడం చంద్రబాబునాయుడుకి ఇష్టంలేదని, జగన్మోహన్ రెడ్డి పప్పు బెల్లాలు లా డబ్బు ప్రజలకు ఇచ్చి రాష్ట్రాన్ని అప్పులు పాలు చేస్తున్నారని అన్నారని, కానీ నేడు అధికారంలోకి వస్తే జగన్మోహన్ రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలు నేను కూడా ఇస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందని, దీనిని మీరంతా గమనించాలని కోరారు. ఈ పంచాయతీని మన ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రమే అభివృద్ధి చేసామని, స్కూల్స్, కాలేజీ, సచివాలయం, రైతు బరోసా కేంద్ర మరియు రోడ్డు మరెన్నో నిర్మించుకున్నామని,మన ప్రభుత్వం హయాంలో బ్రాహ్మణతర్లకి ఒక రూపం తీసుకొని రావడం జరిగిందని తెలిపారు.మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉంటాయని, మీ అందరి ఆశీస్సులు ఈ ప్రభుత్వంపై ఉండాలని, మరలా మన ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డిని సిఎం కుర్చిలో కూర్చోబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరితోపాటు మండల పార్టీ అధ్యక్షులు పైల చిట్టిబాబు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, స్థానిక సర్పంచ్ బాదాన పుష్ప, ఎంపీటీసీ రమణమ్మ, అధికార ప్రతినిధి బి.డి.ఆర్, జేసిఎస్ కన్వీనర్ దువ్వాడ రవి, సర్పంచ్ల సంఘ అధ్యక్షులు కొర్ల సంతోష్, వైస్ సర్పంచ్ పి.ఈశ్వర్‌రావు, వైకుంఠరావు, ధర్మారావు, రామారావు, నాగరాజు, పాలకవర్గ సభ్యులు, సచివాలయం సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మరికొద్ది రోజుల్లో అలికాం-బత్తిలి నాలుగు లైన్ల ఏబీ రహదారి

విశాలాంధ్ర-హిరమండలం: అలికాం నుంచి బత్తిలి వరకు ప్రధాన రహదారి 4 రోడ్లు విస్తరణ తప్పేటట్లు లేదు. అలికాం నుంచి బత్తిలి అనగా ఆమదాలవలస, సరుబుజ్జిలి, ఎల్ ఎన్ పేట, హిర మండలం, కొత్తూరు, బామిని, బత్తిలి వరకు ఇప్పుడున్న 60 అడుగుల ఏబీ రహదారి రానున్న కొద్దీకాలం లో 120 అడుగులు కానుంది. ఇప్పుడు ఉన్న సింగిల్ రోడ్డు వాహనాలు వెళ్లేందుకు పట్టణ జంక్షన్ లవద్ద చాలా ఇరుకుగా ఇబ్బందిగా వెళ్ళడానికి కూడా వీలు లేకుండా పోతుంది. ట్రాఫిక్ కు పూర్తిగా అంతరాయం కలుగుతుంది. పైగా ఇప్పుడున్న 60 అడుగులు వెడల్పు లో 30 అడుగులు లో చిన్న చిన్న వ్యాపారాలు రోడ్డు పైనే కొనసాగుతున్నాయి. దీని వల్ల మరి ప్రయాణికులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం లో 10 సంవత్సరాలు క్రితం 90 అడుగులు మేర బిల్డింగ్ లు కొట్టేసి వెడల్పు చేశారు. వెంటనే మళ్ళీ 60 అడుగులు సరిపోతుంది లే అని 60 అడుగులు రోడ్డు వేశారు. ఇప్పుడు మళ్ళీ 120 అడుగులు 4 లైన్ ల రోడ్ అని ఆర్ అండ్ బి అధికారులు వెల్లడిస్తున్నారు. ఎబి రహదారి కిఆనుకోని ఉన్న ఇళ్ళు దుకాణలను ఎన్ని సార్లు కూల్చి వేతకు గురి కానున్నావో ఇలా రోడ్డు పోయింట్ న ఉన్న బిల్డింగ్ లు రోడ్డు వెడల్పుల కూల్చి వేతకు గురి కావాల్సిందేనా... ఒక్క పైసా కూడా నష్ట పరిహారం కూడా ఇవ్వ కుండా.. రోడ్డు వైండింగ్ ఇప్పుడు 120 అడుగులు ఇంకా రానున్న రోజుల్లో ఈ వెడల్పు కుఇంకా రెట్టింపా..? ఏదిఏమైనా 4 లైన్ల అలికాం నుంచి బత్తిలి ప్రధాన రహదారి తప్పేటట్లు లేదు.

పాదయాత్ర హామీలు అమలుచేయని సీఎం జగన్

- ఖద్దరు ధరించిన క్రూర మృగాలు
- టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ప్రతిపక్ష నాయకునిగా పాదయాత్ర నిర్వ హించిన జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలలో కనీసం 10 శాతం కూడా అమలు చేయకుండా అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ విప్ కూన రవికుమార్ విమర్శించారు. ఆదివారం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి నియోజకవర్గస్థాయి, మండల స్థాయి సమస్యలను సుమారు 760 హామీల కు గాను కనీసం 10 శాతం కూడా అమలు చేయలేని అబద్ధపు ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి అని దుయ్యబట్టారు. రాష్ట్రస్థాయి లో ఇచ్చిన పిఆర్సి కంటే అయ్యార్ ఎక్కు వగా ఇచ్చిన దేశంలోనే ఏకైక తుగ్లక్ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. సిపిఎస్ రద్దు మాట ఎప్పుడో మరిచి పోయా రని గుర్తు చేశారు. జిల్లాల వారీగా ఇచ్చిన వాటిలో కూడా కనీసం 50 శాతం అమలు చేయలేకపోయారని ఆరోపించారు. వీరి చేష్టలకు సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసహ్యిం చుకునే స్థితికి ముఖ్యమంత్రి వచ్చారంటే పాలన ఎంత అస్తవ్యస్తంగా ఉందో తెలియ జేస్తుందన్నారు. నాలుగు నెలలు రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసి ఇప్పుడు టిక్కెట్లు బేరాలు పెట్టారని అందుకే సొంత పార్టీ నాయకులు అసహ్యించు కుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆయనతోపాటు సనపల డిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతి రావు, అంబాల రాంబాబు ఎండ అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

సామాన్యులకు అనువైన రైలు అమృతభారత్

- ఎంపీ రామ్మోహన్ నాయుడు
- అమృత్ భారత్ రైలకు స్వాగతం పలికిన సభాపతి, ఎంపీ,

విశాలాంధ్ర-ఆమదాలవలస : తూర్పు తీర రైల్వే డివిజన్ పరిధిలో గల ప్రాంతాల ప్రజానీకానికి రైల్వే సేవలు పూర్తి స్థాయిలో విస్తరించాలని ఉద్దేశంతో ప్రధాన మంత్రి, రైల్వే మంత్రిత్వ శాఖ సామాన్యులకు అందుబాటులో ఉండే అమృత భారత్ రైలు నెలకొల్పారని స్పీకర్ తమ్మినేని సీతారాం, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడులు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం రోడ్డు (ఆముదాలవలస) రైల్వే స్టేషన్‌లో అమృత భారత్ ఎక్స్ప్రెస్ రైలును ఎంపీ సభాపతి జండా ఊపి ప్రారంభించారు. కర్ణా టక మాల్దా టౌన్ నుండి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు వరకు సుదూర ప్రాంత ప్రయాణికులకు ఈ రైలు ఉపయుక్తకరంగా నిలుస్తుందని వారు తెలిపారు. 12 బోగీలతో అధునాతన సౌకర్యాలతో సామాన్య ప్రజలకు, వలస కార్మికులకు సుదూర ప్రాంతాలు ప్రయాణించేలా కేంద్ర రైల్వే శాఖ ఏర్పాటు చేసిన విషయాన్ని రామ్మోహన్‌నాయుడు వివరించారు. ప్రతి కంపార్ట్మెంట్‌ను నాయకులు ఈస్ట్‌కోస్ట్ డివిజన్ రైల్వే ఉన్నత అధికారులతో, శ్రీకాకుళం ఎంపీ, మాజీ విప్ కూన రవికుమార్ పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. దేశంలోనే తొలిసారిగా తక్కువ ఖర్చుతో అత్యాధునిక సౌకర్యవంతమైన ప్రయాణంకోసం సూపర్ ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లు ప్రవేశపెట్టడం గొప్ప విషయం అన్నారు. సాధారణ ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా నాన్ ఏసీ స్లీపర్ కమ్ అన్ రిజర్వ్ క్లాస్ ఏర్పాటు చేయటం సంతోషించదగ్గ విషయం అన్నారు. పుల్ పుష్ విధానంతో కుదుపులు లేని వేగం, సామర్థ్యం భద్రత సౌకర్యం కల్పన వంటివి ప్రయాణికులకు మేలు చేస్తాయన్నా రు. అదే సమయంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే డిఆర్ఎం కు పలు సూచనలు చేశారు. 22 భోగిల్లో కొన్ని కంపార్ట్మెంట్లకు ఏసీ సౌకర్యం కల్పించడం ద్వారా తక్కువ కర్చు తో సామాన్య ప్రయాణికులకు మేలు చేకూర్చే అవకాశం ఏర్పడుతుందన్నారు. తద్వారా రైల్వే శాఖ పై, ప్రజాభిమానం మరింత పెరిగే వీలుంటుందన్నారు. ఆముదాలవలస మున్సి పాలిటీకి పన్నుల రూపంలో రైల్వే శాఖ చెల్లిం చాల్సిన రూ 1.12 కోట్ల బకాయిలను విడుదల చేసేలా చొరవ తీసుకోవాలని డి ఆర్ ఎం ను తమ్మినేని సీతారాం కోరారు. తద్వారా మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఆముదాలవలస రైల్వే స్టేషన్ ఆనుకొని ఉన్న ఫ్లై ఓవర్ వంతెన దిగువ భాగాన రైల్వే గేట్ మూసివేస్తూ, నిర్మించిన అండర్ టన్నెల్ నిర్మాణం ప్రజలకు రాకపోకల విషయంలో ఇబ్బందులు ఎదురవు తున్నాయి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో గేటు వార్డుల ప్రజానీకానికి మేలు జరిగేలా ఫుట్ పాత్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సభాపతి కోరారు. బిజెపి అధికార ప్రతినిధులను దయస్ పై ఆహ్వా నించక పోవడంతో ఆ పార్టీ నాయకులు కిల్లి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. పేద ప్రజల కోసం నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలును స్వాగతం పలికేందుకు బిజెపిని ఆహ్వా నించక పోవడం పై నినాదాలు చేశారు. స్పందించిన ఏడిఆర్ ఎం గుప్త బిజెపి ప్రతినిధి బిర్లంగి ఉమామహేశ్వరరావు ను వేదిక మీదికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు ప్రత్యేక ఆహ్వానిక సభ్యులతో పాటు బిజెపి టిడిపి వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితునికి చేయూత

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం జగనన్న కాలనీ కి చెందిన సతివాడ భారతి ఇంటిలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ వలన జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఓదార్చి నెలకు సరిపడిన నిత్యవసర సరుకులతో పాటు కొంత నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, జిల్లా మహిళా కార్యదర్శి రోణంకి శాంతాకుమారి వెంకటరమణ, యుటిఎఫ్ నాయకులు బత్తిన ఓంకార్, బి.సి వెల్ఫేర్ అధికారి నీలాపు ఉపేంద్ర, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, కిశోర్ పాత్రో, దాసరి వైకుంఠరావులు పాల్గొన్నారు.

డాక్టర్ సర్వేపల్లి విగ్రహావిష్కరణ

విగ్రహదాత రిటైర్డ్ హెచ్‌ఎం దాస్‌నాయుడు

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం కర్లెమ్మ గ్రామ ఎంపీపీ ప్రాథమిక పాటశాల ప్రాంగణం లో మాజీ రాష్ట్రపతి సమ్మున్నత విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్. ఏమ్. యెద్దు దాస్ నాయుడు మాస్టర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారిసిల్లి రామరాజు మాస్టర్‌లు కలిసి ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని తన తల్లిదండ్రులు యెద్దు సుందరనారయన వరహాలమ్మ చారిటబుల్ ట్రస్ట్ పేరున విగ్రహ ఏర్పాటు జరిగింది. కాగా కుమారుడు దివంగత అమరేష్ నాయుడు జ్ఞాపకార్థం ఏటా డిసెంబర్. 31న రిటైర్డ్ ఏచ్.ఏం.దాస్‌నాయుడు మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాదిన తన స్వంత ఊరు కర్లెమ్మ పాటశాలలో డాక్టర్ సర్వేపల్లి విగ్రహాన్ని నెలకొల్పారు.

దిగిరాకపోతే ఉద్యమం ఉధృతం....

అంగన్‌వాడీల హెచ్చరిక

విశాలాంధ్ర-కొత్తూరు : గత 20 రోజులుగా తమ సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఇక్కడ నిరసన దీక్షలో ఉన్న అంగన్‌వాడిల సంఘ నాయుకులు అన్నారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను నెరవే ర్చాలని కోరుతున్నాము అని వారన్నారు జనవరి 3తేది వరకు వేచి చూసి అప్పటికి ప్రభుత్వం దిగిరాక పోతే చెలో కలెక్టర్ కార్యాలయం నిరసన కార్యక్రమం చేపడతామని సంఘ నాయుకులు అన్నారు కాగ. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు. సిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో దీక్షా శిబిరంలో ఉన్న కార్యకర్తలు, హెల్పెర్లు సమస్యలు పరిష్కరించాలం టూ నినాదాలు చేశారు. సంఘ నాయుకులు కే.జలజాక్షి, లక్ష్మి, హేమలత, బొదమ్మ, ధనలక్ష్మి, విజయలు సారథ్యం వహించారు.

తిమడాం గ్రామంలో ఆడుదాం ఆంధ్ర

విశాలాంధ్ర-జలుమూరు: మండలం తిమడాం గ్రామం లో ఆడుదాం ఆంధ్ర ఆటలు సర్పంచ్, ఎంపీటీసీ చేతులమీదుగా జరిగాయి. ఈ కార్యక్రమనికి ఎక్కడ మంది యూత్, గ్రామ నాయకులు టీం లీడర్ చల్ల సురేష్, హాజరయ్యారు. ఈ కార్యక్రమనికి సర్పంచ్, ఎంపీటీసీలు హాజరై మాట్లాడుతూ, ఆటలు మన శరరానికి ఎంతో ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని స్తాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే అని కొనియాడారు. సర్పంచ్ వెలమల సత్యవతి, ఎంపీటీసీ వెలిమల ఆసిరినాయుడు, పిఈటీ, గొండు లత, సెక్రటరీ రాము, బాలకృష్ణ, సచివాల యం సిబ్బంది,అల్ ఇండియా రోడ్ సేఫ్యటీ కాంట్రాక్టు చల్ల సురేష్, పాల్గొన్నారు.

3న సిక్కోలు డ్వాక్రా బజార్ ప్రారంభం

డీఆర్‌డీఏ పీడీ డా. డి.వి.విద్యాసాగర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జనవరి 3న సిక్కోలు డ్వాక్రా బజారును ప్రారంభిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డా. డి.వి.విద్యా సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో 2024 జనవరి 3 బుధవారం సాయంత్రం 04.00 గంటలకు ప్రారంభం కానుందని, 2024 జనవరి 3 నుండి 9 వరకు ప్రతి రోజూ ఉదయం 10.00గం.ల నుండి రాత్రి 09.30గం.ల వరకు డ్వాక్రా బజారు తెరచివుంటుందని అన్నారు. ఈ బజారులో స్వయం సహాయక బృందాలు తయారుచేసిన వివిధ వస్తువులను ప్రదర్శించడంతో పాటు విక్రయించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

నగర అభివృద్ధే ధ్యేయం

- రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు
- రూ.2 కోట్లతో నిర్మించిన రోడ్లు ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : న్యూ కాలనీలో రూ.1.58 కోట్లతో నిర్మించిన బి.టి.రోడ్‌ను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ ప్రజాపతినిధిగాఉంటూ..ప్రజల గొంతు వినిపించేందుకు ఎప్పుడూ ముందు ఉంటాను అని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిగిలిన పనులకు సంబంధించి టెండర్స్ పిలుస్తున్నాం అని., వాటిని త్వరలో పూర్తి చేస్తాం అని తెలిపారు. రాష్ట్రంలో సర్కులేషన్ ప్యాట్రన్ అమలు లో ఉన్న ఏకైక కార్పొరేషన్ మనదే అని, నగరాన్ని అందంగా తీర్చి దిద్దడానికి ప్రయత్నం చేస్తున్నాం అని వివరించారు. 20 ఏళ్ల క్రితం పట్టణాని సంబంధించి ఏర్పాటు చేసిన గార్బేజీ యార్డు నిండుకుందని, అక్కడ రూ.19 కోట్లతో చెత్తను తొలగించే పనులు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం పుప్పాలవారి వీధి లో 15.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ ప్రారంభించారు. తుమ్మావీధి లో రూ.9.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ ను సైతం ప్రారంభించి, స్థానికులతో మమేకం అయ్యారు.దండి వీధి లో 16.5 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్ ను ప్రారంభించారు.

ఆక్వా కల్చర్ సాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం ఆకాశలాఖవరం పంచాయతీలో ఆక్వాకల్చర్ సాగు, యాజమాన్య పద్ధతులపై ఆదివారం శిక్షణా కార్యక్రమం కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుగ్గు పుణ్యవతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమనికి ఎంపెడ ఎ డి ప్రసాద్ నాయక్, నాస్కా చీఫ్ సెక్రటరీ బాలాజీ, టెక్కలి ఎఫ్ డీ ఓ ర్మరాజు పాత్రో, నాస్కా ఫీల్డ్ మేనేజర్ సునీల్ లు, తగిన విధంగా సూచనలు సలహాలు ఇచ్చారు. ఆక్వా రైతులు పంట, మంచినీటి యాజమాన్య పద్ధతులు, మెరుగైన పద్ధతులతో, అతి తక్కువ పెట్టుబడులుతో ఎక్కువ ఆదాయం సంపాదించటం, రసాయనాలు ఎలా ఉపయోగించాలో తగు జాగ్రత్తలు గూర్చి వివరించారు. అలాగె దగ్గరలో ఉన్నఆక్వా టెస్టింగ్ సెంటర్స్‌లో వారానికి ఒకసారి అయినా టెస్ట్ చేపిస్తూ సరైన పద్ధతులో ఉపయోగిస్తూ ఉంటే మంచి పంటలు పండించవచ్చు అని సూచన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్, ఆక్వా రైతులు పాల్గన్నారు.

ప్రతీ ఇంటికి అయోధ్య రాముని పూజ అక్షింతలు

విశాలాంధ్ర-రణస్థలం : అయోధ్యలో త్వరలో ప్రతిష్ట జరగనున్న శ్రీరామ విగ్రహం ప్రాణప్రతిష్ట లో భాగంగా అక్కడ పూజచేసి వచ్చిన అక్షింతలు ప్రతీ ఇంటికీ పంపిణీ చేయడం జరుగుతుందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర మండలం ప్రముఖ్ బలివాడ శ్రీనివాసరావు, సహాయ ప్రముఖ్ లెంక కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అయ్యప్ప ఆలయములో అక్షింతలు స్పర్శ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రతీ పంచాయితీ కి అక్షింతలు పంపిణీ జరుగుతోందని అక్కడ నుండి ప్రతీ ఇంటికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అక్షింతలను బీరువా ల్లో, వ్యాపారాలు తమ కౌంటర్లు లో శుభాకార్యాలలో వినియోగొంచుకోవచ్చునని అన్నారు. అక్షింతలను వేదంపండితులు నారాయమూర్తి, బాలకృష్ణ శర్మ ఆధ్వర్యములో పూజలు చేసి మరికొన్ని అక్షింతలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రొంపిల్లి ప్రసాదరావు, తాళ్లవలస సర్పంచ్ ప్రతినిధి తిరుపతిరావు, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రతిధులు పొగిరి సూర్యనారాయణ, బొంతు సాయి, శ్రీను, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో గడప గడపకు కార్యక్రమం

విశాలాంధ్ర-సారవకోట/జలుమూరు : మండలం అవిలింగి సచివాలయం పరిధి లక్ష్మీపురం గ్రామాల్లో ఆదివారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి జిల్లా పార్టీ అధ్యక్షులు నరసన్నపేట సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కృష్ణ దాస్, పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్లెట్లను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సారవకోట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామ ప్రజలు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - సారవకోట /జలుమూరు: మండల తహసీల్దార్ కార్యాలయం అవర్ణలో అంగన్వాడీ సభ్యులు తమ డిమాండ్లు పరిష్కరించాలి అనే నినాదంతో చేస్తున్న నిరసన శిబిరం వద్దకు మాజీ శాసన సభ్యులు-ఇన్‌చార్జ్ బగ్గు రమణమూర్తి విచ్చేసి సంఘీ భావం తెలిపారు. ఈయనతోపాటు రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, సీనియర్ నాయకులు బైరి భాస్కరరావు, బగ్గు గోవింరావు, పట్ట ఉమామహేశ్వర రావు, ముఖ్య ప్రధాన కార్యదర్శి ఇసై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఎస్టీయూ శ్రీకాకుళం జిల్లా శాఖకు సంబంధించి 2024-26 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు ఎస్‌వీరమణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదాల తమ్మినాయుడు లు ఎన్నుకోబడ్డారు. అసోసియేట్ అధ్యక్షులు జి. రమణ, జిల్లా అధనపు ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. సూర్యారావు, జిల్లా ఉపాధ్యక్షులుగా కంచరాన తేజేశ్వరరావు, బొడ్డేపల్లి రమేష్, హనుమంతు సత్యం, బడుమూరు పోలినాయుడు, జిల్లా కార్యదర్శులుగా ఎం. పట్టాభినాయుడు, బగాన రమణమూర్తి, ఎం. లక్ష్మి, హెచ్. ప్రశాంత్, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా పేడాడ రామకృష్ణారావు, ఆర్థిక కమిటీ సభ్యులుగా గురువు శ్రీనివాసరావు, హనుమంతు రామకృష్ణ, మహిళా కార్యదర్శిగా వసంతకుమారి, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా జి. రమణ; జిల్లా మైనార్టీ కన్వీనర్‌గా సీహెచ్ మౌనికలను ఎన్నుకున్నారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లా ప్రజలకు 2024 నూతన సంవత్సరం భోగ భాగ్యాలను ఇవ్వాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను ఆదివారం తెలియజేస్తూ నా ప్రియమైన ప్రజలందరికి నూతన సంవత్సరం మంచి ఆరోగ్యాన్ని, క్షేమాన్ని అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరికి నూతన ఉత్తేజాన్ని కల్పిస్తూ ప్రతి కుటుంబం ఆర్థికంగా ప్రగతి పథంలో సాగాలని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థి మృతి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానికంగా ఓ ట్యూషన్ సెంటర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు విహారయాత్రకు మందస మండలం సిగలపుట్టుగ గ్రామం వద్ద సముద్రపు ఒడ్డుకు వెళ్ళగా జరిగిన దుర్ఘటన పాఠకులకు విధితమే. అదే రోజు సముద్రపు అలల్లో చిక్కుకుని గల్లంతైన బెల్లుపడాకు చెందిన ఆశి జయరాం (13) మృతదేహం మరునాడు దొరకింది. కాగా దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి రిమ్స్‌కు తరలించిన ఇద్దరు విద్యార్థుల్లో మరో విద్యార్థి దక్కత చంద్రశేఖర్ (14) ఆదివారం ప్రాణాలు కోల్పోయాడు. పట్టణంలో గొల్లవీధికి చెందిన లింగరాజు ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. లింగరాజు దమయంతిల ముగ్గురు సంతానంలో ఇద్దరు కుమార్తెలు కాగా మృతుడు రెండవ సంతానం. ఉన్న ఒకే కొడుకు కడలి ఒడి నుండి బయటపడ్డా అనంతలోకాలకు పయనమైయ్యాడని ఆ కుటుంభంతో పాటు సమీప బంధువుతు రోధిస్తున్నారు. దాంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా జైభీంసేన ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-సోంపేట : భారత రాజ్యాంగ నిర్మాత, మహా మేధావి, అణగారిన వర్గాలకు అండగా నిలిచి సమ సమాజ స్థాపనే ధ్యేయంగా విశేష కృషి చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాల సాధన లక్ష్యంగా జిల్లాస్థాయిలో ఏర్పాటైన జైభీంసేన ఆవిర్భావ దినోత్సవం ఆదివారం సోంపేటలో ఘనంగా జరిగింది. సంస్థ ఆవిర్భావానికి విశేష కృషి చేసిన డాక్టర్ నగిరి మోహనరావు ఆధ్వర్యంలో డొప్ప వెంకటరావు సభాధ్యక్షతన గొలియా ప్రకాశరావు జ్యోతి ప్రజ్వలనతో మామిడి రవి సిద్ధార్థ ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా సాగింది. ముందుగా వందలాది మంది కార్యకర్తలు గాంధీ మండపం కూడలి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా పట్టణ శివారున విజయదుర్గా ఆలయం వెనుక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధాన వక్త ప్రొఫెసర్ ఎ.డి.పాల్, ఆర్.సుశీల, లీలారాణి, ఎన్.సుజాత, కొత్తపల్లి తేజేశ్వరి, తదితరులు మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలను రూపుమాపి అణగారిన వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచి అంటరాని సామాజికవర్గాలకు ఆధ్యుడిగా నిలిచిన మహానుభావుడుడాక్టర్ అంబేద్కర్ అని అన్నారు. ప్రపంచ దేశాల్లో వివిధ రాజ్యాంగాలను అధ్యయనం చేసి ఈ దేశ సౌరభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రరాజ్యంగా నిలిపేందుకు అహర్నిశలు శ్రమించి అపర మేధావిగా సామాజిక చైతన్యం కోసం ఉద్యమించిన సూరీడు అంబేద్కర్ అని అన్నారు. ఈ సమాజంలో బడుగు, బలహీనవర్గాలు మరింత అభివృద్ధి చెంది సామాజిక వికాసానికి కృషి చేయడంలో అంబేద్కర్ పాత్ర ఎనలేనిదని అన్నారు. అటువంటి మహానుభావుని కృషి, పట్టుదల వల్ల ఈ దేశంలో అణగారిన వర్గాలు కొంత మేరకు ఉపాధి అవకాశాలు అంది పుచ్చుకుంటున్నాయని అన్నారు. డాక్టర్ అంబద్కేర్ ఆశయాలను కొనసాగించేందుకు జైభీంసేన పునరంకితం కావాలని డాక్టర్ నగిరి మోహనరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఎస్.జోరాడు, గమింగి శ్రీకాంత్, బస్క ఈశ్వరరావు, ఇప్పిలి ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసగించిన జగన్ రెడ్డి

- టిడిపి జిల్లా అధ్యక్షుడు రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస : అధికారానికి ముందు హామీలిచ్చి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోస గించారని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన తీరు పై మండిపడ్డారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మెకు ఆదివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మి కులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీక్షా శిబిరం వద్ద కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ జగన్మో హన్ రెడ్డి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వేత నాలు పెంచుతామని రెగ్యులర్ చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చాక మోస గించారని ఆరోపించారు. అధికారం చేపట్టాక అన్నివర్గాల ప్రజలు తీవ్ర నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నా రు. టిడిపి ప్రభుత్వం హయాంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం అందిం చే అన్ని సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా కనీస వేతనాలను కూడా ఇవ్వడం జరిగేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా ఉద్యోగ వ్యతిరేక విధానాలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చా రు. నేడు పారిశుద్ధ్య కార్మికులు, అంగన్వా డీలు, ఆశాలు ఇలా వివిధ రంగాలకు చెందిన చిరు ద్యోగులు రోడ్డెక్కి నిరవధిక సమ్మెలు చేపడు తుంటే ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల డిమాం డ్లను తక్షణమే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు, పారిశుద్ధ్య కార్మికులు తార కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒడియా మైనార్టీలకు వైసిపి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలి

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని రాజపురం పంచాయతీలోని వింధ్యగిరి గ్రామం లో కుతారి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఒడియా మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం సభ ఆంధ్రప్రదేశ్ ఒడియా మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బరంపురం ఎమ్.పి. చంద్రశేఖర్ సాహు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 వేల ఓటర్స్ ఉన్న ఒడియా ప్రజలకు ప్రతినిధిగా ఒడియా మైనార్టీలకు ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే సిటు సత్యనారాయణ పాఢీకి కేటాయించాలని కోరారు.అయనకు సిటు ఇస్తే గెలుపుకు తమవంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే విషిష్ఠ అతిథిగా విచ్చేసిన బరంపురం ఎమ్మెల్యే విక్రమ పండా మాట్లాడుతూ ఎక్కువ ఒడియా మైనార్టీలు నివసిస్తున్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు ఒడియా మైనార్టీలకు ఎమ్మెల్యే గా అవకాశం ఇవ్వక పోవడం దురదృష్టకరమని అన్నారు.ఈ సారి కచ్చితంగా ఒడియా మైనార్టీ అభ్యర్థిగా సత్యనారాయణ పాఢీకి టికెట్ ఇచ్చి ఒడియా ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడలని గెలుపునకు మా వంతు సహయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం చెందిన వివిధ ఒడియా కులల పెద్దలు పాల్గొని ఒడియా మైనార్టీల ప్రతినిధిగా సత్యనారాయణ పాఢీని ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే తప్పకుండా గెలిపించుటకు కృషి చేస్తామని ఒడియా మైనార్టీ సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరాజ్ సాహు,పాండవ చంద్రశేఖర్,కుమార్ నాయక్,శివ బిసొయి,పంచానన రౌళొ,కృష్ణ రౌళొ,రవి ప్రధాన్, మురళి ప్రధాన్,భగవాన్ ప్రధాన్, జి. లక్ష్మీనారాయణ, రామచంద్ర బెహరా, రఘునాథ్ గౌడ, భాస్కర్ పాఢీ, దుర్గా ప్రసాద్ చౌదరి, బృందావన్ దోళాయి, రామహరి పాఢీ, ప్రమొద్ కుమార్ పాఢీ, రాజేంద్ర పండా, శివ ప్రసాద్ పండా, ఘెసి క్రిష్ణ మూర్తి, బిద్యాధర బెహరా, ప్రదోష కుమార్ త్రిపాఠి, కవిరాజ్ రెడ్డి, ఒడియా ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

విజ్ఞతతో రాజకీయం చేయాలి : మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-పోలాకి: రాజకీయాల ద్వారా ఎన్నో చేయవచ్చు కానీ విజ్ఞతతో చేసే రాజకీయమే సరైన సంస్కారంని మాజీ ఉప ముఖ్యమంత్రి నరసన్నపేట నియోజకవర్గం సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం పోలాకి గ్రామ సచివాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పని లేని ప్రతిపక్షం నిత్యం ఆరోపణలు నిందలతో కాలియాపన చేస్తుందని మండిపడ్డారు. సైకో జగన్ అనడం పట్ల మీ వ్యక్తిత్వం మీరే కించపరచుకున్నట్లుందని ప్రతిపక్షాన్ని ఘాటుగా విమర్శించారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి ప్రతిపక్షానికి కనిపించడం లేదాని మాజీ మంత్రివర్యులు కింజరాపు అచ్చన్ననాయుడుని ఉద్దేశించి అన్నారు. కిడ్నీ వ్యాధి సమస్య పట్ల ప్రభుత్వం తీవ్రంగా స్పందించి వెంటనే వ్యాధి నివారణ కోసం రీచర్చ కేంద్రం నిర్మించడం వాస్తవం కాదాని అన్నారు. నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతున్న యువతకు మూలపేట ఫోర్ట్ నిర్మాణం ద్వారా వేల మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పారు. 750 కోట్ల రూపాయలతో నీటి సౌకర్యం కల్పించామని ప్రతి పల్లె అభివృద్ధి చేశామని నాడు నేడు ద్వారా విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు.ప్రభుత్వం చేపట్టిన వెయ్యి కోట్ల రూపాయలతో భూములు రీసర్వే చేయడం రైతులకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో చేపడుతున్న మంతనాలు వల్ల ప్రయోజనం ఏమి ఉండదని చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. మేము చెప్పిన ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న హామీలు నేటికి 99 శాతం వరకు పూర్తి చేసినట్లు చెప్పారు. మీరు చేపట్టిన 14 సంవత్సరాల పాలనలో అభివృద్ధి ఏమైనా ఉందా.. గర్వంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. రెండున్నర లక్షల కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు తో అభివృద్ధి చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. పోలాకి సర్పంచ్ మజ్జి రవణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిసిసిబి అధ్యక్షులు కరిమి రాజేశ్వరరావు నరసన్నపేట మార్కెట్ కమిటీ అధ్యక్షులు దుంపల భాస్కరరావు మండల పరిషత్ అధ్యక్షులు ప్రతినిధి ముద్దాడ బైరెగినాయుడు మండల పరిషత్ ఉపాధ్యక్షులు కోట అప్పారావు కనితి కృష్ణారావు పాగోటి అప్పారావు ఎంపీటీసీ తూలుగు అశోక్ కుమార్ మండల పరిషత్తు ఏవో సూర్యప్రకాశరావు సచివాలయ కార్యదర్శి పాల్గొనగా సభా కార్యక్రమం కు ఆహ్వానం పలికిన ఊరజాం సర్పంచ్ కనితి సత్తిబాబుతో పాటు పోలాకి సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ వైఎస్ఆర్సిపి మండల యువజన నాయకుడు రెంటి కోట త్రినాధరావు స్థానిక అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గోపాలరావు పలువురు గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు పలువురు పాల్గొన్నారు.

ఆర్టీఐ ద్వారా బయటపడుతున్న వాస్తవాలు

తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
బాధిత కుటుంభానికి న్యాయం చేయాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మండలంలో ఈదుపురం గ్రామంలో దళితుల భూములు పెత్తందారులకు కట్టబెట్టిన అంశంలో అధికారుల తీరు పై నిరంతర పోరాటం చేస్తునే ఉన్నామని, క్షేత్రస్థాయి సిబ్బందితో తప్పులు చేయించిన అధికారులను కప్పిపుచ్చుకునేలా వ్యవహారాలు సాగుతున్నా సమాచార హక్కు చట్టం అధికారుల వ్యవహారాలను బయటపెట్టడంలో కీలకంగా మారిందని సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు అనపాన షణ్ముఖ రావు,ఉప్పాడ సూర్యనారాయణ అన్నారు. ఈదుపురం రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు 399/2బి 0.30 సెంట్లు ల్యాండ్ సీలింగ్ భూమికి సంబంధించిన కీలక పత్రాలు ఆర్టీఐ దరఖాస్తు ద్వారా బయట పడ్డాయని తెలిపారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్.సి.1492/2023/సి/తేది.26.12.2023 పేరిట ఆర్డీఓ నోటీసులు జారీ చేసి విచారణ జరిపారు. విచారణకు బాధిత దళిత దంపతులు దోప ఎస్తేరు, దోప ఎరవయ్యలకు సహాయంగా స.హ.చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖ రావు పాల్గొన్నారు. ఈదుపురం పాత సర్వే నెంబర్లు 8/1,7/5,9/1,9/2,9/3,9/4,9/5,9/6 ఏ ల కొత్త సర్వే నెంబరు 399లో విస్తీర్ణం 9.01 ఎకరాలు భూమిని బెంధాళం సభకీర్తమ్మ భర్త దశరథ రామమూర్తి వద్ద ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు ఎల్.సి.సి.267/75గా 1985 ఫిబ్రవరి 28 రికార్డుల్లో స్పష్టంగా నమోదు కాబడి ఉండి, 35మంది లబ్ధిదారులతో ఎల్.సి.సి.263,266,267,ఇచ్ఛాపురం/75, తేది.16.12.85గా టెక్కలి సబ్ కలక్టరు కార్యాలయం నుండి జిల్లా కలక్టరుకు పంపిన ప్రతిపాదనల్లో ఒకరు బీసీ కులానికి చెందిన వ్యక్తితో పాటు 34మంది ఎస్సీ కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు ల్యాండ్ సీలింగ్ భూమికి డి-పట్టాలు పంపిణీ చేసినట్లు 1986 ఫిబ్రవరి7 నాటి రికార్డు స్పష్టం చేసిందని, అప్పటికే సబ్ డివిజన్ చేసి సర్వే నెంబరు 399/2బి 2. 72 ఎకరాల భూమికి కొఠారి గ్రామానికి చెందిన బండారి జేమ్స్‌తో పాటు 9మందికి డి పట్టాలు ఇచ్చారు. బండారి జేమ్స్ పేరిట 1403, 2012 కంప్యూటర్ అడంగల్‌లో, భూ బదలాయింపు నిషేదపు చట్టం 1908,సెక్షన్ 22-ఏ(1)(డి) లోనూ చాలా స్పష్టంగా నమోదు అయ్యి ఉందని, తండ్రి ద్వారా వారసత్వంగా సంక్రమించిన ల్యాండ్ సీలింగ్ డి పట్టా భూమి తన సంపూర్ణ స్వాధీన అనుభవంలో ఉన్నందున ఈ భూమికి సరిహద్దులు నిర్ణయించమని ఎఫ్.ఎల్.నెం.ఎఫ్ ఎల్/1210/2022 ద్వారా దరఖాస్తు చేసుకోగా 2022 ఆగష్టు15న మండల తహశీల్దార్ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్‌ను దోప ఎస్తేరు పేరున జారీ చేసారు. తరువాల బాధ్యతలు చేపట్టిన మండల తహశీల్దార్ ఎస్.గురుప్రసాద్ పెత్తందార్లకు సహాయపడి ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నీరుగార్చడానికి తప్పుడు నివేదికలను ఆర్.సి. నెం.150/2023/సి,తేది.23.05.2023, ఆర్.సి. నెం.388/2022/సి,తేది 29.05.2023 ద్వారా కాశీబుగ్గ డిఎస్పీకి అందించారని తెలిపారు. తప్పుడు నివేదికలు ఇచ్చి అట్రాసిటీ కేసు నీరుగార్చి దళితుల హక్కుల భంగం కలిగించనందుకు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సెప్టెంబరు 4,5 తేదీల్లో జిల్లా కలక్టరేట్ వద్ద భాదితులు నిరసన తెలపినా, తప్పును సరిదిద్ది బాధితులకు న్యాయం చేయవలసిన అధికారులు సదరు తహశిల్దార్‌ను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని షణ్ముఖరావు అన్నారు. వాస్తవాలు నిర్ధారించడానికి సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారి లేక జ్యుడిషియల్ ఎంక్వైరీ చేయాల్సింది పోయి, ఆరోపణలు ఎదుర్కొంటున్న నాటి తహశీల్దార్‌కు అప్పటి పలాస రెవెన్యూ డివిజన్ అధికారి టి. సీతారామ మూర్తి ఆదేశాలు జారీ చేయడం ద్వారా విచారకరమని, నిబంధనలను తుంగలోకి తొక్కి ఆర్.సి. నెం.388/2023బి తేది.09.10.2023 ద్వారా బాధితులకు వ్యతిరేకంగా రెవెన్యూ రికార్డులు పరిశీలించకుండా పూర్తి నిరాధారాలతో కూడిన విచారణ నివేదికను పలాస ఆర్డీఓకు పంపించారని వివరించారు. అందుకు నిరాసనగా గత నెల 26న మండల తహశీల్దారు కార్యాలయం వద్ద బాధిత ఎస్సీ కుటుంభం ధర్నా చేసింది. విచారణ జరిపి నాటి మండల తహశీల్దార్ ఎస్.గురుప్రసాద్ చేసిన తప్పిదాలపై చర్యలు తీసుకోకుండా, అతన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో ఉండటంతో భాదితులు ఆందోళన చెందుతున్నారని షణ్ముఖరావు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ రికార్డులను పట్టించుకోకుండా తప్పుడు విచారణ నివేదికలపై సమగ్రమైన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కార్మిక సంఘం నాయకులు ఉప్పాడ సూర్యనారాయణ,చుక్క రాము,మత్స్య కార్మిక సంఘం నాయకులు నాగుల తవుడు , బాధిత ఎస్సీ కుటుంభీకులతో కలిసి డిమాండ్ చేసారు.

రాష్ట్రంలో అవినీతికి చిరునామాలు సిఎం జగన్, పలాసలో మంత్రి డా. సీదిరి

ఎంపీ రామ్మోహన్ నాయుడు ఎద్దేవా

విశాలాంధ్ర-పలాస : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇసుక, భూ కబ్జాలు, లిక్కర్ మాఫియా చేస్తూ అవినీతికి పాల్పడుతుంటే సిఎంను ఆదర్శంగా తీసుకొని పలాసలో రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కొండలు, గుట్టలు, భూములు సైతం మింగేస్తున్నారని జిల్లా ఎంపీ రామ్మోహన్ నాయుడు ఆరోపించారు. పలాసలో టిడిపి ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలాస మండలం లొత్తూరు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుకు చెందిన 125 కుటుంబాలు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, జిల్లా ఎంపీ రామ్మోహన్ నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. అనంతం జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ సిఎం అధికారంలోకి రాక ముందు మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి నేడు మందు బ్రాండులను సొంతంగా తయారు చేస్తూ ప్రజల ధనాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలకు నీరు సరఫరా చేయలేరు గానీ ఇష్టానుసారంగా మందు సరఫరా చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ మందు తాగి వేల సంఖ్యలో ప్రజలు మృతి చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో అంగన్వాడి, మున్సిపల్ కార్మికులు, సర్వశిక్షా ఉద్యోగులు ఇలా ప్రతీ ఒక్కరు ధర్నాలు రాస్తారోకోలు చేపడుతున్న సిఎంకు చీమ కుట్టినట్లు లేదన్నారు. భవిష్యత్తు తరాల క్షేమం కోసం చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఉందని, టిడిపిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజు నియంత్రణ పాలన చేస్తున్నారని, అందుకు నిదర్శనం 31 వార్డు నుంచి ప్రజలు ఎవరు టిడిపిలో చేరవద్దని తన అనుచరులతో భయ పెట్టడమన్నారు. అయినా వార్డు ప్రజలు, మహిళలు సైతం భయ పడకుండా టిడిపిలో చేరడం గొప్ప విషయమన్నారు. మంత్రి భయపడితే ఇక్కడ భయపడేది లేదని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పలాసలో తాను గెలుపు ఖాయమన్నారు. తాము గెలిచిన తర్వాత మంత్రి సీదిరి తట్ట బుట్ట పట్టుకొని పలాస నుంచి పారిపోయే పరిస్థితి వస్తుందన్నారు. మంత్రి ఎంత భయపెట్టిన మీకు అండగా తాను ఉంటానని, ఏ సమయంలోనైనా చిన్న ఫోన్ చేస్తే చాలు మీ వద్దకు వాలిపోతానన్నారు. 200 పడకల ఆసుపత్రి, కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని సిఎం చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభం చేశామని గొప్పలు చెప్పడం కాదు, నా తండ్రి శివాజీ హయాంలో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ వరుపులను కిడ్నీ ఆసువత్రికి తరలించేందుకు మంత్రి సిగ్గు పడాలన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు, కొరికాన శంకర్, బి నాగరాజు, మాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్,మల్లా శ్రీనివాసరావు, అంబటి కృష్ణమూర్తి, గోళ్ళ చంద్రరావు, సప్ప నవీన్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయం

మండల టిడిపి అధ్యక్షుడు రమేష్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: రానున్న 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు కావడం ఖాయమని ఆయన తెలిపారు. టెక్కలి నియోజకవర్గం టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరావు అచ్చెన్నాయుడు సారథ్యంలో తెలుగుదేశం పార్టీ ఎంతో బలోపేతంగా ఉందని కచ్చితంగా టెక్కలి గడ్డపై టిడిపి జెండా ఎగర వేస్తామని రమేష్ ధీమ వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు వైకాపా ప్రభుత్వంలో ఎన్నో అవస్థలు పడుతున్నారని ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఆయన తెలిపారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుస్తుందని భయంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ దాదాపు 70 మందికి పైగా ఎమ్మెల్యే స్థానాలను మారుస్తున్నారని వైకాపాకు ఓడిపోతామని భయం పట్టుకుందని ఇప్పటికే వైకాపా పతనం మొదలైందని ఇక 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైకాపాను చిత్తుగా ఓడించి తెలుగుదేశం పార్టీని భారీ మెజార్టీతో గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడులు టెక్కలి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని గత టిడిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప వైకాపా ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఆయన తెలిపారు. టెక్కలి నియోజకవర్గ ప్రజలు అచ్చెన్నాయుడు వెంటే ఉన్నారని ఏది ఏమైనా రానున్న ఎన్నికల్లో అచ్చెన్నాయుడు సహకారంతో తెలుగుదేశం పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని రమేష్ తెలిపారు.

సనాతన ధర్మాన్ని సంరక్షించుకోవాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : భారతీయులు ప్రతిఒక్కరూ సనాతన ధర్మానికి మూల కేంద్రమైన భారతదేశంలో వికృతపు పోకడలను నిలువరిస్తూ సనాతన సాంప్రదాయాన్ని సంరక్షించుకోవాలని పొందూరుకు చెందిన గీతానందస్వామి, ఇస్కాన్, కూర్మగ్రామానికి చెందిన త్రిభంగానందదాసులు అన్నారు. ఆదివారం మండలం చీపుర్లపాడు పంచాయతీ, ఊడికలపాడు శ్రీరామమందిరంలో ప్రవచన కారులు సనపల కరుణకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సత్సంగ సమావేశంలో వార ముఖ్య అతిథులుగా పాల్గొని హిందూ ధర్మంపై ప్రవచనాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రపంచానికంతా మార్గసూచన ఇచ్చిన ధర్మం హిందూ ధర్మమన్నారు. అలాగే భక్తులను ఉద్దేశించి పలు ఆద్యాత్మిక ప్రవచనాలు అందించారు. అంతకు ముందు కోటబొమ్మాళి ఆర్యాసమాజం వారిచే గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. అలాగే సనపల రమణమ్మ కరుణ్‌కుమార్ దంపతులు ఆర్థిక సహాయంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

స్టార్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: జిల్లా లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహణలో అగ్ర స్థానంలో ఉన్న స్టార్ వాక ర్స్ క్లబ్‌కు నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాకర్స్ గవర్నర్ కర్రోతు సత్యం సారథ్యంలో ఈ ఎంపిక నిర్వహించారు. ఇంత వరకు అధ్యక్షునిగా పనిచేసిన ఎస్. జోగి నాయుడు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం లో అధ్యక్షునిగా బి వి. రవిశంకర్, ప్రధాన కార్యదర్శిగా, బి. దేవీప్రసాద్, కోశాధికారిగా గోలీ ఉమా మహేశ్వర రావు, ఉపాధ్యక్షునిగా బొడ్డేపల్లి ప్రసాదరావు, జాయింట్ సెక్రటరీ గా బి. వెంకట సత్యనారాయణ, జోలీ వాకర్ గా మలిపెద్ది మల్లి బాబు, గౌరవ అధ్యక్షు లుగా జి. ఇందిరా ప్రసాద్, మరో ఆరుగురు బోర్డ్ డైరెక్టర్లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కూన వెంకట రమణ మూర్తి, పి. జి. గుప్తా, గుడ్ల సత్యనారాయణ, డాక్టర్ జి. నారాయణ రావు, వై. మోహన్, గోలి సంతోష్ కుమార్, జి. లక్ష్మీ, భరాటం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ రాక్షస పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

19వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి రాక్షస పాలనకు రోజులు దగ్గర పడ్డాయని సిఐటియు జిల్లా నాయకురాలు దుంపల సుదర్శన అన్నారు. ఆదివారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన అంగన్వాడీలు 19వారోజు నృత్యాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం నేత దుంపల సుదర్శన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నామని, తమ డిమాండ్లు న్యాయమైనవని, చాలా సార్లు విజ్ఞాపనలు ఇచ్చినా పరిష్కరించకపోవడంతో విసిగిపోయి సమ్మెలోకి దిగామని, ఇలాంటి పరిస్థితుల్లో సమస్యలపై చర్యలు జరిపి పరిష్కరించాల్సింది పోయి ప్రభుత్వం అధికారుల చేత బెదిరింపులకు పాల్పడడం సరికాదని అంగన్వాడీలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులు ధర్నా

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు ఆదివారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ఆరో రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, సిపిఐ నియోజకవర్గం నాయకులు చాపర వేణుగోపాల్, యూనియన్ నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు సి హెచ్ మురగన్, యం రవి, యూనియన్ నాయకులు దివాకర్, యస్ శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుల వేదింపులే దాము చావుకి కారణం...

మృతుని కటుంబ సభ్యులు ఆరోపణ

విశాలాంధ్ర-రణస్థలం : ఈ మధ్యకాలంలో మరణించిన లావేరు మండలం సాక్షి విలేఖరి పై అధికార పార్టీ నాయకుల వేధింపులే కారణమని ఆయన మరణ వాంగ్మూలంలో ఉన్నదని, ఈ విషయంపై శనివారం రణస్థలం మండల కేంద్రంలో ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎమ్మెల్యే గొర్ల కిరణ్ కుమార్ నిర్వహించిన మీడియా సమావేశంలో దాముకి చెందిన కుటుంబ సభ్యులతో మాట్లాడిన వారు తమ కుటుంబ సభ్యులు కాదని వారు చెప్పిన మాటలు అన్నీ కూడా అసత్యాలని భార్య, సుజాత, పిల్లలు సుమంత్, వర్షినీ, తమ్ముళ్లు శ్రీను, కోటి బావమరిదులు, ఇనుపకుర్తి సతీష్, రమణ తెలిపారు. ఇటువంటి ఆరోపణలు మా కుటుంబం పై మోపడం తగదని ఇప్పటికీ ఆయన మరణంతో మేమంతా కూడా షాకులో ఉన్నామని ఇటువంటి తప్పుడు మాటలతో మమ్మల్ని మా కుటుంబాన్ని మరింత ఇబ్బందులకు గురి చేయవద్దని ఆదివారం లావేరు మండలం సాక్షి విలేఖ రి దామోదరరావు స్వగృహంలో తమ కుటుంబ సభ్యులు మీడియా సమావేశంలో తెలియజేశారు. ఎప్పటికైనా అధికారులు, నాయకులు ఈ విషయంపై స్పందించి తమ కుటుంబానికి తమ పిల్లలకు తగు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కిడ్నీ ఆసుపత్రిలో ఫార్మాసిస్ట్‌ను నియమించాలి

విశాలాంధ్ర-పలాస : నూతనంగా ప్రారంభించిన పలాస కిడ్నీ ఆసుపత్రిలో ఫార్మాసిస్ట్ ను నియమించాలని ఏపిఎన్‌జీవో అధ్యక్షులు, బోనెల గోపాల్ కోరారు. ఈమేరకు ఆదివారం రాష్ట్ర మంత్రి డా. సీదిరి అప్పలరాజుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లో భాగంగా కడప సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఫార్మసిస్ట్ సూపర్ వైజర్ 1, ఫార్మసిస్ట్ గ్రేడ్-1, ఫార్మసిస్ట్ గ్రేడ్-2, 3 పోస్టులు మంజూరుచేసిన మాదిరిగా పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో చేయవలసిందిగా రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పల రాజు దృష్టికి తీసుకొచ్చారు.

ఎన్ఆర్ఆజీఎస్ మేట్స్‌కు ఒకరోజు శిక్షణ

విశాలాంధ్ర-జలుమూరు: మండల కేంద్రంలోని వెలుగు సమావేశ మందిరంలో ఎంజిఎన్ఆర్ఆజీఎస్ మేట్స్‌కు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ వాన గోపి మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీకి రోజుకు రూ.272 వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ఏయే పనులు చేపట్టాలి, మేట్స్ యొక్క విధులను ఏపీవో పి సోమేశ్వరరావు వివరించారు. ఎన్ఆర్ఆజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో కాంస్య పతకం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రముఖ యోగా శిక్షకుడు శ్రీకాంత్ మహంతి మరోసారి జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకున్నారు. పట్టణానికి చెందిన శ్రీకాంత్ యోగాలో నిరంతర సాధన చేస్తూ పలువురికి శిక్షణ ఇస్తూ వివిధ స్థాయి పోటీల్లో పాల్గొని పలు బంగారు పతకాలను సాధించారు. డిసెంబర్ 27నుండి29వరకూ పశ్చిమబంగా దూర్గపూర్‌లో ఇండియన్ యోగ ఫెడరేషన్ నిర్వహించిన 42వ జాతీయ యోగాసన ఛాంపియన్‌షిప్-2023 పోటీలలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుని కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా అతన్ని పలువురు ప్రశంశించి అభినందించారు.